సాక్షి సంగారెడ్డి

శనివారం : 24 : ఫిబ్రవరి : 2024



ప్రోత్సాహం.. నిరుత్సాహం

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన 'అమ్మఒడి' పథకం మసకబారిపోతోంది.

వివరాలు 8లో ▸



మురుగు.. ఇక పరుగు

దశాబ్దాల నుంచి నాచగిరిని మురుగు పట్టి పీడిస్తుంది. హల్దీలోకి మురుగు చేరకుండా ఒకే పనితో రెండు సమస్యలు పరిష్కారమయ్యేలా ఇరిగేషన్ శాఖ పనులు చేపడుతున్నది.

వివరాలు 8లో ▸

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి : జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్, డేటా మేనేజర్, ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ ప్రతిపాదికన ఉద్యోగులను తీసుకోనున్నట్లు చెప్పారు. 15రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

న్యూస్‌రీల్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

స్ట్రాంగ్ రూం పరిశీలించిన కలెక్టర్ క్రాంతి

జహీరాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంను శుక్రవారం సాయంత్రం కలెక్టర్ క్రాంతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూంలలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రూట్ ఇన్‌చార్జిలు, సెక్టార్ అధికారులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. పీఓలు, ఏపీఓలు, ఎన్నికల సిబ్బంది, డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి సమయానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జహీరాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీఓ రాజు, డీఏఓ మల్లేశం, డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌లతో పాటు వంశీ, రాజిరెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఏడీఏ బాధ్యతల స్వీకరణ



సత్యనారాయణ

రాయికోడ్(అందోల్) : రాయికోడ్ సహాయ వ్యవసాయ సంచాలకుడిగా(ఏడీఏ) సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇబ్రహీంపట్నంలో పనిచేశారు. ఇక్కడ పనిచేసిన హరిత ఏడాది క్రితం బదిలీ కాగా, ఆమె స్థానంలో మునిపల్లి మండల ఏఓ శివకుమార్‌కు ఏడీఏగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. శనివారం రాయికోడ్, మునిపల్లి, వట్‌పల్లి మండలాలకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించనున్నారు.

క్రషర్లకు నోటీసులు జారీ

జిన్నారం(పటాన్‌చెరు): అనుమతులకు మించి బ్లాస్టింగ్‌లు చేపడుతున్న ఎనిమిది కంకర క్రషర్లకు నోటీసులకు అందించినట్లు తహసీల్దార్ భిక్షపతి తెలిపారు. జిన్నారం మండలంలోని ఖాజీపల్లి, సోలక్‌పల్లి, మాదారం గ్రామాల పరిధిలోని ఎనిమిది కంకర క్రషర్లు నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములను ఆక్రమించి బ్లాస్టింగ్‌లు జరుపుతున్నట్లు గుర్తించామన్నారు. వాటి యజమానులైన వెంకటప్రసాద్, లలిత, ఆనంద్‌రెడ్డి, అరుణ, పూర్ణచంద్, ఎండీ గౌస్, పరమేశ్వర్‌సింగ్, రాక్‌సాండ్ పరిశ్రమ ప్రతినిధులకు నోటీసులు అందించామని తెలిపారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించినట్లు చెప్పారు. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

పోస్టాఫీసులో సొమ్ము స్వాహాపై విచారణ

సాక్షి ఎఫెక్ట్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఈనెల 23న సాక్షిలో ప్రచురితమైన 'పోస్టాఫీసులో సొమ్ము స్వాహా..!' కథనానికి పోస్టల్ అధికారులు స్పందించారు. పోస్టల్ శాఖ జిల్లా ఎస్పీ మురళి కుమార్ ఆదేశాలతో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సావిత్రి శుక్రవారం తన సిబ్బందితో కలిసి వెంకటాపూర్ గ్రామానికి వచ్చారు. అక్కడ ఖాతాదారుల లావాదేవీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమాస్టర్‌పై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని తెలిపారు. ఈనెల 26 సోమవారం నాటికి ఖాతాదారులకు వారి పాస్ పుస్తకాలు,డబ్బులు ఇప్పిస్తామని పేర్కొన్నారు.

అలసత్వం వద్దు



జోగిపేటలో మాట్లాడుతున్న డీఈ శ్రీనివాస్

జోగిపేట(అందోల్): విద్యుత్ సిబ్బంది విధుల నిర్వహణలో అలసత్వం వహించొద్దని ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం జోగిపేటలో నిర్వహించిన డివిజన్ స్థాయి ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యపై ప్రజలు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాస్, ఆయా మండలాల ఏ.ఈలు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అంతరాయం లేని విద్యుత్ సరఫరా

సంగారెడ్డి: వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ మాధవరెడ్డి, డీఈఈ సురేందర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి డివిజన్‌కు సంబంధించి జిల్లా కేంద్ర కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఏడీఈలు, ఏఈలు ఉన్నారు.

ప్రమాద ఊహాచిత్రం



అసలేమైంది?

- ఇంకా నిర్ధారణకు రాని పోలీసులు
- ప్రమాదం జరిగిన తీరుపై సమగ్ర దర్యాప్తు
- ఐదు శాఖల నిపుణులతో ప్రత్యేక బృందం
- డ్రైవర్ ఆకాష్ స్టేట్‌మెంట్ రికార్డు
- కళ్లు బైర్లు కమ్ముకోవడంతో ప్రమాదం జరిగిందని చెప్పినట్లు సమాచారం.?
- ఓఆర్‌ఆర్‌పై సీసీటీవీ పుటేజీల సేకరణ

ఢీకొట్టింది వాహనానికా.. రెయిలింగ్‌కా..?

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : కంటోన్మెంట్ ఎమ్మెల్యే జ్ఞాన లాస్య నందిత కారు ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై పోలీసులు ఇంకా ఓ నిర్ధారణకు రాలేక పోతున్నారు. నందిత ప్రయాణిస్తున్న కారు గుర్తు తెలియని వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీకొట్టిన తర్వాత.. అదుపు తప్పి అతి వేగంగా వెళ్లి రోడ్డు పక్కనున్న రెయిలింగ్‌కు గుద్దుకుందా? లేదా డైరెక్ట్‌గా రెయిలింగ్‌కు ఢీకొట్టిందా.. అనే దానిపై ఇంకా పూర్తి స్థాయిలో నిర్ధారణకు రాలేకపోతున్నారని సమాచారం. ఈ రోడ్డు ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై సమగ్ర దర్యాప్తును ప్రారంభించిన పోలీసులు.. ఇప్పటికే కారు నడుపుతున్న ఎమ్మెల్యే పీఏ ఆకాష్ వద్ద స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ప్రమాదం జరిగినప్పుడు కళ్లు బైర్లు కమ్ముకున్నట్లు అయన పేర్కొన్నట్లు సమాచారం.

వాహనంపై రోబోసాండ్ రేణువులు..

ప్రమాదానికి గురైన వీరి వాహనం ఎస్‌ఎల్-6 కారుపై రోబోసాండ్ రేణువులు పడి ఉన్నాయి. దీనిని బట్టి ఈ వాహనం టిప్పర్‌ను ఢీకొట్టిందనే ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఓఆర్‌ఆర్‌పై ఉన్న టోల్‌గేట్ల వద్ద ఉన్న సీసీటీవీ పుటేజీలను పరిశీలిస్తే.. ఆ సమయంలో సుమారు 15 నుంచి 20 వరకు టిప్పర్లు లాంటి భారీ వాహనాలు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అలా కాకుండా వీరి వాహనం సుమారు గంటకు వంద కిలోమీటర్ల వేగంతో వెళ్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌కు గుద్దుకుందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన చోట టిప్పర్ లాక్కెళ్లినట్లు గుర్తులు ఏమైనా ఉన్నాయా? అని పరిశీలించారు.

మృతురాలు ఎమ్మెల్యే కావడంతో..

రోడ్డు ప్రమాదంలో మరణించినది ఎమ్మెల్యే కావడంతో ఈ ఘటనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కేసు దర్యాప్తును అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలను తేల్చేందుకు పోలీసులు ఐదు శాఖలతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులతో పాటు, మోటార్‌వెహికిల్ (టాన్స్‌పోర్టు డిపార్టుమెంట్), సివిల్ ఇంజనీర్ (ఓఆర్‌ఆర్ ఇంజనీరింగ్ విభాగం), క్లూస్‌టీం, ఫోరెన్సిక్ డాక్టర్లు.. ఇలా ఐదు కీలక శాఖల నిపుణులతో ప్రత్యేక బృందం ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. ఆయా శాఖల నిపుణులు ఒకటీ రెండు రోజుల్లో నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం.

వాహనాన్ని పరిశీలించిన బృందం

ప్రమాదానికి గురైన వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన నిపుణుల బృందం లాస్యనందిత సీటు బెల్టు పెట్టుకున్నట్లు నిర్ధారణకు వచ్చారు. బెల్టు పెట్టుకుంటేనే బెలూన్‌లు ఓపెన్ అయ్యాయని చెబుతున్నారు. అయినా లాస్య తీవ్ర స్థాయిలో గాయాల పాలవడం.. ఏకంగా మృత్యువాత పడటం ఎలా జరిగిందనే కోణంలో కూడా నిపుణుల బృందం దర్యాప్తు చేస్తోంది. వీరి వాహనం కొత్తది కావడంతో ఫిట్‌నెస్ లోపాలు కూడా ఉండవనే నిర్ధారణకు వచ్చారు.

మలుపులు లేని రోడ్డు..

ఇంజనీరింగ్ విభాగం నిపుణులు ఔటర్‌రింగ్ రోడ్డుపై ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అయితే ప్రమాదం జరిగిన చోట ఎలాంటి మలుపులు లేవని నిర్ధారణకు వచ్చారు. ఈ ప్రదేశంలో ఎక్కడైనా సీసీటీవీ పుటేజీ దొరుకుతుందేమోనని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఒకటీ రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో తేల్చే అవకాశాలున్నట్లు పోలీసుశాఖ వర్గాలు చెబుతున్నాయి.

హరీశ్‌రావు పరామర్శ



లాస్య బంధువులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్

పటాన్‌చెరు/ సంగారెడ్డి: లాస్య నందిత మృతి వార్త విని ఎమ్మెల్యే హరీష్‌రావు హుటాహుటిన పటాన్‌చెరుకు చేరుకున్నారు. అమేద ఆసుపత్రి వద్ద లాస్య కుటుంబ సభ్యులను, బంధువులను పరామర్శించారు. అలాగే లాస్య నందిత మృతి చెందడం పట్ల మంత్రి దామోదర రాజనర్సింహ, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతోమంచి భవిష్యత్తు ఉన్న యువ ఎమ్మెల్యే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు.

తాగునీటి సమస్య రావొద్దు

- పన్నుల వసూళ్లలో వేగం పెంచండి
- సమీక్షలో మంత్రి దామోదర

జహీరాబాద్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటికెపల్లి నుంచి నీటిని అందించే పైప్‌లైన్ దెబ్బతిన్నందున ఆరు నెలల్లోగా పునరుద్ధరించాలన్నారు. మున్సిపల్ సిబ్బంది కొరత ఉంటే నియమించుకోవాలని సూచించారు. పన్నుల వసూళ్లను సక్రమంగా నిర్వహించి శానిటేషన్ ఇబ్బందులు తీరేలా చూడాలన్నారు. ఐడీఎస్ఎంటి సమస్యను సైతం పరిష్కరించేలా చూస్తామన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో జరుగుతున్న జాప్యం గురించి ఆర్‌అండ్‌బీ డీఈఈ నర్సింహులు మంత్రికి వివరించారు. చేసిన పనులకు రూ.2కోట్ల మేర కాంట్రాక్టర్‌కు బిల్లులు బకాయి ఉందని, మరో రూ.10కోట్లు కేటాయిస్తే పనులు పూర్తవుతాయని వివరించారు. మంత్రి స్పందిస్తూ నిధులిస్తామని, పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. మెప్మా భవన నిర్మాణానికి స్థలం గుర్తిస్తే నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఇంటిగ్రేటెడ్ దుకాణాల సముదాయం నిర్మాణానికి రూ.4.50 కోట్లు బకాయి ఉన్నందున కాంట్రాక్టర్ తాళం వేసుకున్నాడని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. కాంట్రాక్టర్ జావీద్‌తో మాట్లాడి బకాయిలు ఇప్పిస్తానని, తాళం ఇవ్వాలని సూచించగా కలెక్టర్ క్రాంతికి అందజేశారు. మంత్రి వెంట కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గైర్హాజర్

మంత్రి దామోదర రాజనర్సింహా సమీక్ష సమావేశానికి బీఆర్‌ఎస్‌కు చెందిన స్థానిక ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు గైర్హాజరయ్యారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య మరణించడం వల్లే రాలేదా లేక మరేదైనా కారణమై ఉంటుందా అనే విషయమై పలువురు చర్చించుకోవడం కనిపించింది.

ఆస్పత్రి సేవలపై ఆరా

జహీరాబాద్‌లోని ఏరియా ప్రభుత్వాస్పత్రిని మంత్రి దామోదర సందర్శించారు. అక్కడి వైద్య సేవల గురించి ఆరా తీశారు. రోగులు అధికంగా ఉన్నందున అందుబాటులో ఉన్న యంత్రాలు సరిపోవడం లేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. మరో ఐదు యంత్రాలను కేటాయించేలా చూస్తానని చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందుతుందని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామంలో 2కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న పీహెచ్‌సీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పలువురికి షాది ముబారక్ చెక్కులు అందించారు. అనంతరం దత్తగిరి లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.మాజీ మంత్రి చంద్రశేఖర్, దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పటేల్, వినీలనరేష్ కుమార్, దేవదాసు, మల్లన్న పాటిల్, ఉదయ్ శంకర్ పాటిల్ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ, చిత్రంలో కలెక్టర్ క్రాంతి

స్పందించి ఉంటే.. బతికేదేమో?

పటాన్‌చెరు: ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు అందిఉంటే ఎమ్మెల్యే లాస్య నందిత బ్రతికేదేమోనని విశ్లేషిస్తున్నారు. ఔటర్‌పై ప్రమాదం జరిగినప్పుడు ఆ సమాచారం సిబ్బందికి చేరేటప్పటికీ చాలా సమయం పడుతుంది. వాయువేగంతో వెళ్లే ప్రయాణికులెవరూ ప్రమాదంలో గాయపడ్డవారికి సాయం చేసే పరిస్థితి ఆ రోడ్డుపై ఉండటం లేదు. వేగంగా వెళ్లే వారు ఏదో జరిగిందని చూసీచూడనట్లు వెళ్లిపోవడం సహజం. లాస్య నందిత ప్రమాదం జరిగిన వెంటనే చనిపోయి ఉండదనే వాదన ఉంది. త్వరగా ఆసుపత్రిలో చేర్పి ఉంటే బతికి ఉండేదని చర్చించుకుంటున్నారు. ఆమె వాహనం ఉదయం శామీర్‌పేట వద్ద ఉదయం 5.11 గంటలకు ఓఆర్‌ఆర్‌పై కి చేరిందని తెలుస్తుంది. అయితే ప్రమాద స్థలికి చేరుకునే సరికి దాదాపు 20 నిమిషాల్లోపే పడుతుంది. ఆమె ప్రయాణించిన వాహనం గంటకు వంద కిలోమీటర్ల కంటే వేగంగా వెళ్తుందని అంచనా వేస్తే 5.30 గంటలకల్లా ప్రమాదం జరిగి ఆమె కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుంటుంది. అయితే సమాచారం పోలీసులకు అంది ఆమెను ఆసుపత్రికి తెచ్చేలోపు గంటకు పైగా సమయం పట్టింది. ఔటర్‌పై ప్రమాదాలు జరిగితే మరింత వేగవంతంగా సమాచారం అందేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. ఔటర్ పెట్రోలింగ్ వాహనాలున్నప్పటికీ ప్రమాదంపై సమాచార త్వరగా చేరే వ్యవస్థ లేదు. దీంతో ప్రమాద బాధితులకు వెంటనే సహాయక చర్యలు అందడం లేదు.

మట్టిదారులకు మహర్దశ

- 745 పనులకు రూ.55.32కోట్లు
- మార్చి నెలాఖరు వరకు గడువు

నారాయణఖేడ్: పల్లెల్లో మట్టి దారులను సిమెంటు రోడ్లుగా మార్చేందుకు నిధులు మంజూరయ్యాయి. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో జిల్లాకు రూ.55.32 కోట్ల నిధులు కేటాయించారు. ఇటీవల సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యేలు పంపిన ప్రతిపాదనలకు మోక్షం లభించింది. జిల్లాలో 647 పంచాయతీల్లో అంతర్గత రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. వీటికి సంబంధించి జిల్లావ్యాప్తంగా 745 పనులు చేపట్టాల్సి ఉంది. 40 శాతం ఉపాధి కూలీలు, 60 శాతం సామగ్రి వాటాతో చేపడతారు.

ప్రత్యేకాధికారులదే బాధ్యత

గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ బాధ్యత పంచాయతీలకే ఉండేది. సర్పంచుల పదవీ కాలం ముగిసి ప్రత్యేకాధికారులు కొలువుదీరారు. ఈ పనులు ప్రస్తుతం వారే చూడాల్సి ఉంది. గతంలో వీటిని నామినేషన్ పద్ధతిపై కేటాయించేవారు. ప్రత్యేకాధికారులు పంచాయతీ తీర్మానం చేయాల్సి ఉంటుంది. పనుల కేటాయింపును జిల్లా స్థాయి కమిటీ చూసుకుంటుంది. ఈ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. పంచాయతీరాజ్ ఇంజి నీరింగ్ అధికారి కన్వీనర్, డీఆర్డీఓ, డీపీఓలు సభ్యులుగా వ్యవహరిస్తారు. గ్రామాల్లో సమస్యల ఆధారంగా ప్రాధాన్యక్రమంలో పనులు చేపడతారు.



నారాయణఖేడ్ కంగ్టి మండలం బాన్సువాడలో నూతన కాలనీలో మట్టిరోడ్డు

ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు..

సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలకు ఏటా ఫిబ్రవరి, మార్చి మొదటి వారంలో నిధులు మంజూరు చేస్తుంటారు. వార్షిక సంవత్సరం ముగిసేలోపు మార్చి 31వ తేదీలోపు ఆయా పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ హడావుడిగా రోడ్లు నిర్మిస్తున్నారు. పనులన్నీ ఒకేసారి ప్రారంభించడంతో పర్యవేక్షణ గాడి తప్పుతోంది. వేసిన రెండేళ్లకే చాలాచోట్ల ధ్వంసమవుతున్నాయి. మొన్నటి వరకు ఉన్న సర్పంచులు వేసిన సీసీ రోడ్లకు కొన్ని చోట్ల నిధులు మంజూరు కాలేదు. ఈ పనులను నెలలోపు త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది. జిల్లాలో నారాయణఖేడ్, ఆందోల్ నియోజకవర్గాలకు అత్యధికంగా పనులు మంజూరయ్యాయి.

మంజూరైన పనులు (రూ.కోట్లలో)

నియోజకవర్గం	పనులు	నిధులు
నారాయణఖేడ్	231	12.95
అందోల్	176	15.78
జహీరాబాద్	136	8.24
సంగారెడ్డి	117	8.35
పటాన్‌చెరు	47	8.00
నర్సాపూర్ (హత్నూర)	38	2.00

స్కాంలు ఎవరు చేసినా వదలం

లిక్కర్ కేసులో కవిత జైలుకు ఖాయం

- హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ మీనమేషాలు
- కేంద్ర సహాయ మంత్రి అశ్విని చౌబే

పటాన్‌చెరు టౌన్: ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట కవిత త్వరలో జైలుకు వెళ్లడం ఖాయమని కేంద్ర పౌర సరఫరాలు, అటవీ, పర్యావరణ శాఖల సహాయ మంత్రి అశ్విని కుమార్ చౌబే అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజరాజేశ్వరి విజయ సంకల్ప యాత్ర కార్యక్రమంలో అయన మాట్లాడారు. దేశంలో స్కాంలు ఎవరు చేసినా వదలబోమని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా పరిపాలన అందిస్తూ, దేశ సంస్కృతి, అభివృద్ధిని ప్రపంచానికి ఆదర్శంగా నిలుపుతున్నారని చెప్పారు. యావత్ ప్రపంచం మన దేశం వైపు చూస్తోందన్నారు. ఢిల్లీలో పప్పు, బిహార్‌లో లప్పు, ఉత్తరప్రదేశ్‌లో గప్పు, సప్పు వీళ్లందరూ దేశం ప్రగతి విరోధకులుగా నిలుస్తున్నారని విపక్షాల ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇండియా కూటమి పేరుతో మోసం చేసేందుకు ప్రజల ముందుకు వస్తున్నారని విమర్శించారు. దేశాన్ని ముక్కలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీకి ప్రధాన మంత్రి కుర్చీ కావాలట.. కుర్చీ ఇస్తే దేశాన్ని అమ్మేస్తారని చెప్పారు. కేరళ నుంచి పార్లమెంటుకు పంపితే ఒక్క రోజు కూడా ప్రజల కోసం పనిచేసింది లేదన్నారు. భారత్ జోడో యాత్ర కాదు.. భారత్ తోడోయాత్ర అని ఎద్దేవా చేశారు. భారత్ న్యాయ యాత్ర పేరుతో కోట్లు వెనకాల వేసుకుంటున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభావం తప్పదన్నారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. 400 ఎంపీ స్థానాలు గెలిచి మూడోసారి ప్రధాని మోదీ కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ శాసన సభ పక్ష నేత మహేశ్వర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షురాలు గోదావరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర అశ్విని కుమార్ చౌబే

బాసర విద్యార్థిని అంత్యక్రియలు పూర్తి

మనూరు (నారాయణఖేడ్): బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని శిరీష(17) అంత్యక్రియలు శుక్రవారం ఆమె స్వగ్రామం మనూరు మండలం డోవూర్ గ్రామంలో నిర్వహించారు. గురువారం క్యాంపస్‌లో ఆమె ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. నిర్మల్ ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం డోవూర్‌కు తీసుకొచ్చారు. వారి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, శిరీషకు పదో తరగతిలో 10జీపీ ర్యాంకు రాగా బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఉన్నత చదువులు చదివి తిరిగి వస్తుందనుకున్న కూతురి జీవితం అర్ధంతరంగా ముగియడంతో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. శిరీష ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది.

26న పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

హుస్నాబాద్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ నెల 26న పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు సింగిల్ విండో సీఈఓ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సింగిల్ విండో ద్వారా కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పొద్దుతిరుగుడు ఉత్పత్తులను మార్కెట్ యార్డులో అమ్ముకోవాలన్నారు. క్వింటాల్‌కు రూ. 6,760 ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు.

చేజారాక.. పెరిగిన ధర!

- బహిరంగ మార్కెట్లో పత్తి రేటు పైపైకి..
- అంతా అమ్ముకున్నాక పెరిగితే ఏం లాభం?
- నిరాశలో రైతాంగం

జహీరాబాద్: జిల్లాలో పత్తి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పత్తి పంటను అమ్ముకున్నాక ధర పెరగడంతో వారు ఏడవాలో.. నవ్వాలో తెలియని పరిస్థితి నెలకొంది. గత ఏడాదితో పోల్చితే ఈ సారి పత్తి ధరలు తక్కువగానే ఉన్నాయి. ప్రభుత్వం సీసీఐ కేంద్రాల ద్వారా పత్తిని కొనుగోలు చేసింది. అధికంగా ఉత్పత్తులు రావడంతో కేంద్రాల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యమైంది. దీంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించక తప్పలేదు. వారు రైతుల వద్ద తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసి గుజరాత్ ప్రాంతానికి తరలించారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. గత ఏడాది ఆరంభంలోనే క్వింటాలు ధర రూ.8వేలు పలికింది. ఈ ఏడాది మాత్రం ఆరంభంలో రూ.7వేలుగా ఉంది. ప్రభుత్వం క్వింటాలు ధర రూ.7,020 నిర్ణయించి కొనుగోళ్లు చేసింది. దళారులు మాత్రం రూ.6,600 నుంచి రూ.6,700కు కొనుగోలు చేశారు. విధిలేని పరిస్థితుల్లో రైతులు తక్కువ ధరకే ప్రైవేటుకు అమ్ముకున్నారు.

పెరుగుతున్న పత్తి ధర

ప్రస్తుతం పత్తి ధర పెరుగుతోంది. అమ్మకాలన్నీ పూర్తయ్యాక బహిరంగ మార్కెట్లో ధర పెరుగుతుండటంతో రైతులు మనోవేదన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాలు ధర రూ.6,900 మొదలుకుని రూ.7,200 వరకు పలుకుతోందని చెబుతున్నారు. ఉత్పత్తులను విక్రయించుకున్న తర్వాత ధర పెరిగితే ఏం లాభమని వాపోతున్నారు. పత్తిని నిల్వచేసుకున్న వారికే లబ్ధి చేకూరుతుందంటున్నారు.



న్యాల్‌కల్‌లో లారీలో నింపుతున్న పత్తి పంట

జిల్లాలో విస్తారంగా పత్తి సాగు

వర్షాకాలంలో పత్తి పంట జిల్లా వ్యాప్తంగా 3.55లక్షల ఎకరాల్లో సాగైంది. సగటున ఎకరాకు 8 క్వింటాళ్ల మేరకు సుమారు 2.80కోట్ల క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చింది. ఇందులో సుమారు 1.50 కోట్ల క్వింటాళ్ల ఉత్పత్తులను సీసీఐ కొనుగోలు చేసింది. మిగతా ఉత్పత్తులను రైతులు ప్రైవేటు వ్యక్తులకు విక్రయించుకున్నారు.

ప్రైవేటుకు అమ్ముకున్న



పత్తి పంటను సాగు చేయగా 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సీసీఐకి తరలించేందుకు ఇబ్బంది కావడంతో ప్రైవేటు వ్యక్తులకు క్వింటాలుకు రూ.6,700లకు విక్రయించా. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పు తీర్చేందుకు ముందస్తుగానే అమ్ముకున్నాను. ఇప్పుడు ధర పెరిగితే ఏం లాభం.

– కె.బిచ్చయ్య, రైతు–కోహీర్

క్లుప్తంగా

ప్రతి క్షణమూ విలువైనదే

వైద్యురాలు డాక్టర్ పాశం మేధారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మేధారెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఎవరైనా గుండెపోటుకు గురై కుప్పకూలినప్పుడు ప్రతీ క్షణమూ విలువైనదని, గుండె పునర్జీవనం కోసం తక్షణమే ప్రయత్నించాలంటూ ఏఐజీ ఆస్పత్రి కన్సల్టెంట్ వైద్యురాలు డాక్టర్ పాశం మేధారెడ్డి తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ 'బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్), ప్రథమ చికిత్స'అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ప్రధాన వక్తగా, శిక్షకురాలిగా హాజరయ్యారు. భారత ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ విద్యార్థి విభాగం (ఐపీఏ-ఎస్ఎఫ్), ఏఐజీ ఆస్పత్రి, గీతం ఫార్మసీ విద్యార్థుల సంఘం సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఎల్ఎస్ ప్రథమ చికిత్స పద్ధతులపై ప్రసంగం చేసి, వాటిని ప్రదర్శించి చూపారు. గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ నిర్వహణ పద్ధతి, తక్షణం స్పందించే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమయానుకూల జోక్యం వంటి వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బప్పాదిత్య ఛటర్జీ, డాక్టర్ గూడి శ్రీకాంత్, ఏఐజీ ఆస్పత్రికి చెందిన డాక్టర్ వికాస్, అశోక్, గీతం అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక



పోటీలను ప్రారంభిస్తున్న పరమేశ్వర్

సిద్దిపేటజోన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాల బాలికలకు ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25నుంచి హైదరాబాద్ కొల్లూర్ లో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో రెండు బంగారు పతకాలు సాధించిన జితేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి రామేశ్వర్ రెడ్డి, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ స్వామి, ప్రతినిధులు ఉప్పలయ్య, కుమార్, విజయ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహం.. నిరుత్సాహం

- గర్భిణులకు అందని నగదు బదిలీ
- మూడేళ్లుగా పెండింగ్‌లోనే..
- ఆందోళనలో 69,674 మంది లబ్ధిదారులు
- రూ.20.90 కోట్ల బకాయిలు
- కేసీఆర్ కిట్‌ను.. ఎంసీహెచ్ కిట్‌గా మార్చిన ప్రభుత్వం

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలను పెంచడం కోసం బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన 'అమ్మఒడి' పథకం మసకబారిపోతోంది. జిల్లాలో ఈ పథకం అమలవుతున్నా.. ప్రసూతి మహిళల అకౌంట్‌లో నగదు ప్రోత్సాహకం జమ కావడం లేదు. 2022లో ఇప్పటి వరకు జిల్లాలో 69,674 మంది గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీ అయ్యి తమ వివరాలను నమోదు చేసుకున్నారు. నాలుగు దశల్లో అందించాల్సిన నగదు ఇప్పటి వరకు రాకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. డెలవరీ అయ్యాక కేసీఆర్ కిట్ మాత్రమే ఇచ్చి ప్రోత్సాహక నగదు ఇవ్వడం లేదని వాపోతున్నారు. - సిద్దిపేటకమాన్

ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీ అయిన వారికి కేసీఆర్ కిట్‌తోపాటు అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టి నాలుగు విడతలుగా డబ్బులు ఖాతాల్లో జమ చేస్తుంది. ఇందులో భాగంగా ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు, మగ బిడ్డ పుడితే రూ.12 వేలు అందిస్తున్నారు. మహిళ గర్భిణీగా ఆస్పత్రిలో పేరు నమోదైన తర్వాత పరీక్షలు నిర్వహించుకొని మూడు, నాలుగు నెలల కాలంలో టీడీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా మొదట విడతగా రూ.3 వేలు, ప్రభుత్వాసుపత్రుల్లో డెలివరీ అయితే బాబు రూ.4 వేలు, పాప రూ.5వేలు రెండవ విడతగా, బాబుకు మూడున్నర నెలలు వ్యాక్సిన్ వేయించడం వల్ల రూ.2 వేలు మూడవ విడతగా, 9 నెలల వయస్సులో మరో రూ.3వేలు నాల్గో విడత కింద అందజేసేవారు. కానీ 2022 నుంచి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో డెలివరీ అయిన వారికి నగదు ప్రోత్సాహం అందడం లేదు.

రూ.20.90 కోట్లు పెండింగ్

జిల్లాలో 2022లో 36,821 మంది ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీ చేసుకోగా వీరిలో ఇద్దరికి మాత్రమే నగదు ప్రోత్సాహకం అందింది. మిగితా వారికి రూ.11,04,57,000 పెండింగ్‌లో ఉన్నాయి. 2023 లో ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీ అయిన 30,117 మంది తల్లులకు అందాల్సిన రూ. 9,03,51,000 పెండింగ్‌లోనే ఉన్నాయి. 2024లో ఇప్పటి వరకు 2,738 మంది డెలివరీ కాగా వారికి రూ.82,14,000 పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 2022 నుంచి ఇప్పటి వరకు మొత్తం 69,674 మంది లబ్ధిదారులకు రావాల్సిన నగదు ప్రోత్సాహకం మొత్తం రూ.20.90 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. నిధుల కొరతతో లబ్ధిదారుల అకౌంట్‌లో డబ్బులు జమకావడం లేదు. వెంటనే స్పందించి డబ్బులను విడుదల చేయకపోతే పూర్వ స్థితికి వచ్చే ప్రమాదం లేకపోలేదని ప్రభుత్వాస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి.



సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి

ఎంసీహెచ్ కిట్‌గా మార్పు..



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం కేసీఆర్ కిట్‌ను ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్చింది. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీ అయిన వారికి కేవలం కిట్‌లతోనే సరిపెడుతున్నారు. మహిళలు నగదు ప్రోత్సాహకం కోసం నెలల తరబడి ఎదురు చూపులు తప్పడం లేదు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రస్తుతం ఎంసీహెచ్ కిట్‌లు సైతం కొరత ఉంది. స్టాక్ అందుబాటులో లేదని వైద్యులు చెబుతున్నారు.

ఒక్క రూపాయి రాలేదు



ప్రభుత్వ ఆస్పత్రిలో గతంలో మొదటి కాన్పు జరుగగా అప్పటి డబ్బులు రాలేదు. ఈ నెల 9వ తేదీన సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రెండవ డెలివరీ జరుగగా బాబు జన్మించాడు. మూడవ నెల మొదట్లో టీకా తీసుకున్న తర్వాత రూ.2వేలు వస్తాయని చెప్పారు కానీ రాలేదు. ప్రభుత్వాస్పత్రిలో డెలివరీ జరిగినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రాలేదు.

– నాగలక్ష్మి, మిరుదొడ్డి

డబ్బులు జమ కాలేదు



2022లో నాకు ప్రభుత్వాస్పత్రిలో డెలివరీ జరుగగా బాబు జన్మించాడు. అప్పుడు కిట్ మాత్రమే ఇచ్చారు. రూ.12 వేలు వస్తాయని చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఖాతాలో జమ కాలేదు. ప్రభుత్వం నుంచి అందాల్సిన డబ్బులు వస్తే పిల్లలకు ఏదో ఒక రకంగా ఉపయోగపడుతాయి. ప్రభుత్వం స్పందించి డబ్బులు జమయ్యేలా చూడాలి.

– అనిత, బెజ్జంకి

ప్రభుత్వ విశ్వవిద్యాలయం నెలకొల్పాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

సిద్దిపేట ఎడ్యుకేషన్: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, సిద్దిపేటలో ప్రభుత్వ విశ్వవిద్యాలయం నెలకొల్పాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో జిల్లాకేంద్రంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయం నెలకొల్పాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, టీపీటీఎఫ్, డీటీఫ్ సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి, సత్తయ్యలు మాట్లాడారు. యూనివర్సిటీతో ఈ ప్రాంత విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. అదే విధంగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలన్నారు. పెండింగ్ హాస్టల్ మెస్ చార్జీలు విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేసి, విద్యా రంగానికి తగినన్ని నిధులు కేటాయించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దిపేటలోని అగ్రికల్చర్ కాలేజీని వేరే ప్రాంతానికి తరలించే ఆలోచనను విరమించుకోవాలన్నారు. అన్ని రకాల ఉద్యోగ నోటిఫికేషన్లలో మహిళ రిజర్వేషన్లను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘం నాయకుడు జాన్ వెస్లీ, న్యాయవాది బైరి ప్రవీణ్, పీడీఎస్‌యూ ఇంజినీరింగ్ వింగ్ కన్వీనర్ వెంకట్, న్యాయవాదులు విజయ్ కుమార్, శివ, పీడీఎస్‌యూ కన్వీనర్ రేణుక, అక్షిత పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీల దొంగలు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనిల్‌కుమార్

జోగిపేట(అందోల్): ట్రాక్టర్ ట్రాలీలను చోరీ చేస్తున్న దొంగల ముఠాను జోగిపేట సర్కిల్ పరిధిలోని పుల్కల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించి జోగిపేటలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ శ్రీకాంత్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గతేడాది సెప్టెంబర్ 1న చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన బండ్ల విఠల్ రెడ్డికి చెందిన ట్రాక్టర్ ట్రాలీ చోరీకి గురి కావడంతో బాధితుడు పుల్కల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు పుల్కల్ ఎస్ఐ నేతృత్వంలో సిబ్బంది ముదిమాణిక్యం చౌరాస్తా వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. ఓ ట్రాక్టర్ ఇంజిన్‌పై ఆరుగురు వస్తూ పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా సుల్తాన్ పూర్, చౌటకుర్ మండలంలోని శివ్వంపేట, సంగారెడ్డి మండలంలోని ఇరిగిపల్లి, వెండికోల్, జిన్నారం మండలంలోని సోలక్ పల్లి గ్రామాల్లో మొత్తం ఆరు ట్రాలీలను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. వెంటనే వారిని అరెస్ట్ చేసి ట్రాలీలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.8.10 లక్షలు ఉంటుందన్నారు. ఈ కేసులో శివ్వంపేట గ్రామానికి చెందిన అలకుంట నరేశ్, సత్తి రాజీవ్, ల్యాగల రవికుమార్, వడ్డె శ్రీను, వడ్డె కుమార్, బండారి రవిలపై కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక డంప్‌లపై దాడులు



బెజ్జంకిలో ఇసుక డంప్ వద్ద సీఐ జానకీ రాంరెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్, బెజ్జంకి క్రాసింగ్‌లలో గల ఇసుక డంపులపై శుక్రవారం టాస్క్ ఫోర్స్ సీఐ జానకీ రాంరెడ్డి ఆధ్వర్యంలో బెజ్జంకి పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ లభించిన సుమారు 10 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు.

నంగునూరు(సిద్దిపేట): అక్కెనపల్లి వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు. అనుమతి పత్రాలు లేకుండా ఖాత గ్రామానికి చెందిన సిరిగిరి సంపత్ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకొని స్టేషన్‌కు తరలించామన్నారు.

ఇంకా ఆగని పొగలు



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వస్తున్న పొగలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని 220కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో పేలిన 100ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి శుక్రవారం కూడా పొగలు వచ్చాయి. ప్రమాదం జరిగి మూడు రోజులు అయినప్పటికీ ఇంకా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పొగలు వస్తూనే ఉన్నాయి. ఇప్పటికే ఈ ఘటనపై రవాణాశాఖ మంత్రి విద్యుత్‌శాఖ అధికారులను దర్యాప్తుకు ఆదేశించిన విషయం తెలిసిందే.

కూతురిని బస్సు ఎక్కించి వస్తుండగా..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హుస్నాబాద్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన హుస్నాబాద్ పట్టణ శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోహెడ మండలం మైసంపల్లి గ్రామానికి చెందిన వేగలం అశోక చారి (53)కి నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉండగా, అందరూ కలిసి సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లారు. జాతర ముగించుకున్న తర్వాత కూతురిని హుస్నాబాద్‌కు తీసుకొచ్చి కరీంనగర్ బస్సు ఎక్కించాడు. బైక్ పై తిరిగి వెళ్తుండగా పట్టణ శివారులోని శ్రీ చైతన్య పాఠశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఏదైనా వాహనం ఢీకొట్టిందా లేదా డివైడర్‌ను ఢీకొని పడి మృతి చెందాడా అనే విషయాలు తెలియాల్సి ఉంది.

కారు, బైక్ ఢీ

- యువకుడు అక్కడికక్కడే మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- కౌడిపల్లిలో ముగ్గురికి గాయాలు

వేర్వేరు ప్రాంతాల్లో కారు, బైక్ ఢీకొని యువకుడు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి.

వట్‌పల్లి(అందోల్): కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడిక్కడే మృతి చెందిన ఘటన అందోలు మండల పరిధిలోని సంగుపేట వద్ద నాందేడ్ 161 హైవేపై శుక్రవారం చోటు చేసుకుంది. జోగిపేట ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కొల్చారం మండలం ఎనగండ్ల గ్రామానికి చెందిన మణికంఠ(19), మధు ఇద్దరూ కలిసి సంగారెడ్డి నుంచి జోగిపేట వైపు బైక్‌పై వస్తున్నారు. అలాగే, నాందేడ్-అకోలా 161 జాతీయ రహదారిపై సంగుపేట వద్ద కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మణికంఠ అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ అరుణ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): కారు, బైక్ ఢీకొనడంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లి శ్రీరేణుక ఎల్లమ్మదేవి ఆలయం సమీపంలో 765డి జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ఎల్లమ్మగూడ గ్రామానికి చెందిన యాదయ్య కారులో కౌడిపల్లి వచ్చి జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటున్నాడు. అలాగే, హైదరాబాద్‌కు చెందిన యువకులు బైక్‌పై ఏడుపాయలకు వెళ్తున్నారు. కారు యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరితోపాటు కారులో వ్యక్తికి గాయాలు అయ్యాయి. బాధితులను 108లో నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని తరలిస్తున్న పోలీసులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ నాగరాజు వివరాల ప్రకారం.. పెద్దరాజుపేట గ్రామంలోని నూనె వెంకటేశం ఇంట్లో అక్రమంగా 43 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచినట్లు సమాచారం అందింది. ఈ మేరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వెంకటేశంపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సీజ్ చేసిన బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు అప్పగించినట్లు తెలిపారు.

మురుగు.. ఇక పరుగు

నాచగిరిని వీడనున్న పారిశుద్ధ్య సమస్య

- చకచకా డ్రైనేజీ కాల్వల నిర్మాణం
- పరిశుభ్రంగా మారనున్న హల్దీ వాగు
- చెక్‌డ్యాం, స్నానపుఘాట్లు పూర్తి



క్షేత్రంలో కొనసాగుతున్న మురుగు మళ్లింపు కాల్వ నిర్మాణ పనులు

వర్గల్(గజ్వేల్): ఏళ్ల తరబడి నాచగిరిని పట్టిపీడిస్తున్న మురుగు సమస్యకు ఇక చెక్ పడనుంది. దశాబ్దాలుగా మురుగునీరు హల్దీ చెక్ డ్యాంను కలుషితం చేస్తోంది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో క్షేత్రానికి పారిశుద్ధ్య సమస్య, హల్దీలోకి మురుగు చేరకుండా ఒకే పనితో రెండు సమస్యలు పరిష్కారమయ్యేలా ఇరిగేషన్ శాఖ ప్రణాళికాయుతంగా పనులు చేపడుతోంది. క్షేత్రంలోని మురుగునీరంతా చెక్ డ్యాంలో చేరకుండా దిగువకు వెళ్లిపోయేలా డ్రైనేజీ కాల్వలు నిర్మిస్తున్నారు. 'హల్దీ' సుందరీకరణ పనుల పుణ్యమా అని క్షేత్రంలో మురుగు ఇక్కట్లు తొలగిపోనున్నాయి.

మురుగునీరు తాండవం..

ప్రకృతి రమణీయతలు కలబోసిన సహజ సిద్ధ కొండగుహల్లో నాచారం గుట్ట శ్రీలక్ష్మీ నారసింహ క్షేత్రం వెలసింది. క్షేత్రాన్ని చుడుతూ ఆలయం ఎదుట నుంచి అర్ధ చంద్రాకృతిలో పడమర వైపు పరవళ్లు తొక్కుతూ సాగిపోయే పవిత్ర హరిద్రా (హల్దీ)నది వాగు ప్రకృతి ప్రసాదిత వరం. కానీ క్షేత్రంలోని 100 గదుల సత్రాలు, ఇతర అతిథిగృహాలు, దుకాణాలు, ప్రైవేటు గృహాల నుంచి మురుగునీరు తరలించే వ్యవస్థ సరిగా లేదు. ఎక్కడపడితే అక్కడ మురుగునీటితో పారిశుద్ధ్య సమస్య తాండవిస్తోంది. దీనికి తోడు మురుగునీటిని వాగులోకి వదిలేస్తున్నారు. దీంతో హరిద్ర (హల్దీ) కాలుష్య కాసారమవుతుంది. రూ.కోట్లతో నిర్మించిన హల్దీ చెక్‌డ్యాంలోకి మురుగు నీరు చేరితే అపవిత్రమవుతుందని భక్తులు వాపోయారు.

డ్రైనేజీ దారి మళ్లింపు

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నాచగిరి వద్ద నూతన చెక్‌డ్యాం పూర్తయింది. క్షేత్రం పరిసరాల్లోని మురుగునీరు అందులోకి చేరకుండా దాదాపు 900 మీటర్ల మేర డ్రైనేజీ కాల్వలు నిర్మిస్తున్నాం. డైవర్షన్ కాల్వలతో మురుగునీరు చెక్‌డ్యాం దిగువకు వెళ్లిపోతుంది. చెక్‌డ్యాంలో జలాలు శుభ్రంగా ఉంటాయి. కాల్వ నిర్మాణ పనులు నెల రోజుల్లోగా పూర్తి చేయిస్తాం.

– పవన్‌కుమార్, గజ్వేల్ డివిజన్ ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ

తీరనున్న సమస్య



క్షేత్రంలో మురుగు నీరు వెళ్లే సదుపాయం సరిగా లేకపోవడంతో పారిశుద్ధ్య సమస్య ఎక్కువైంది. హల్దీ పనుల్లో భాగంగా క్షేత్రంలో డైవర్షన్ మురుగు కాల్వలు నిర్మిస్తున్నాం. మురుగు సమస్యతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– అన్నపూర్ణ (నాచగిరి ఈఓ)

చెక్ డ్యాంతోపాటు మురుగుపై దృష్టి..

హల్దీవాగు సుందరీకరణకు 2018లో రూ.7.48 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా ఆలయం ముందు వరకు నీరు నిలిచేలా చెక్‌డ్యాం, స్నానపుఘాట్లు పూర్తి చేశారు. దీంతో యాత్రికుల నదీ స్నానానికి సుగమమైంది. ఈ క్రమంలోనే హల్దీవాగులో మురుగు నీరు చేరకుండా దృష్టిసారించారు. ఎక్కడ నుంచి మురుగు నీరు వస్తోంది. మురుగునీరు ఎలా మళ్లించాలి అనే దానిపై ఇరిగేషన్ అధికారులు సర్వే చేశారు. అందుకు అనుగుణంగా మెయిన్ రోడ్ నుంచి అయ్యప్ప టెంపుల్, ఎల్లమ్మ టెంపుల్ మార్గంలో, సత్రాలు, అతిథి గృహాల మార్గంలో, కార్యాలయ సముదాయం, గోశాల మార్గంలో భారీ డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులు వేగవంతం చేశారు. దాదాపు 900 మీటర్ల పొడవున నిర్మిస్తున్న మురుగు డైవర్షన్ కాల్వలతో దిగువకు మురుగు నీరు వెళ్లిపోతుంది.

సమగ్ర భూసర్వే చేయించాలి



మాట్లాడుతున్న రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు భైరవరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూసర్వే చేయించాలని రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు భైరవ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేటలో నిర్వహించిన సమావేశంలో భైరవరెడ్డి మాట్లాడుతూ ధరణి రద్దు చేయాలన్నారు. రైతు బంధు, రూ.2లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని కోరారు. పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలు నెలకొల్పకపోవడం వలన రైతులు రూ.4 వేలకే అమ్ముకుని నష్ట పోతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కోతుల బెడద వల్ల రైతులు పంట నష్ట పోతున్నారని, ప్రభుత్వం కోతుల బెడదను అరికట్టాలని కోరారు. కేంద్రప్రభుత్వం పంటల మద్దతు ధర కు చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు. వడ్డీలేని రుణాలను రైతులకు అందించాలని, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో మహేందర్, రాజేంద్ర ప్రసాద్, పులి రంగారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఎల్లారెడ్డి, మల్లయ్య, వెంకట రెడ్డి, ఎల్లయ్య, రాజయ్య పాల్గొన్నారు.